పోలీసుల అదుపులో ముగ్గురు?

కాళేశ్వరం, నవంబర్ 28 : మహదేవ్‌పూర్ మండలం చంద్రుపల్లి వద్ద బుధవారం రాత్రి ముత్యాల శ్రీకాంత్ గౌడ్‌ను రోడ్డుపై కత్తులతో పొడిచి హత్య చేసిన కేసులో ముగ్గురిని మహదేవపూర్ సీఐ రాంచందర్ రెడ్డి అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. బుధవారం రాత్రి ఇద్దరిని అదుపులోకి తీసుకోగా, గురువారం మధ్యాహ్నం మరొకరిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. హత్యకు గల కారణాలను పోలీసులు కూపీ లాగుతున్నారు. శుక్రవారం ఉదయం హత్య జరిగిన స్థలానికి నిందితులను తీసుకెళ్లి, సీన్ రీ సకన్‌స్ట్రక్షన్ చేసి, కోర్టులో హాజరు పరచనున్నట్లు సమాచారం.

ఈజీఎస్ ఏపీవోగా రాజు

వాజేడు, నవంబర్ 28 : మండల కేంద్రంలోని గ్రామీణ ఉపాధిహామీ పథకం (ఎన్ఆర్ఈజీఎస్) ఏపీవోగా మాలోత్ రాజు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ములుగు మండలం నుంచి బదిలీపై వచ్చిన ఆయన ఎంపీడీవో విజయను మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం ఇన్‌చార్జి ఏపీ సత్యేంద్రకుమార్ నుంచి బాధ్యతలు స్వీకరించారు.

దేవాదుల పంపింగ్ బంద్

కన్నాయిగూడెం, నవంబర్ 28 : మండలంలోని దేవాదుల ఎత్తిపోతల ప్రాజెక్టులో గోదావరి నీటి పంపింగ్‌ను గురువారం బంద్ చేశారు. ఇప్పటివరకు మోటర్ల ద్వారా 5.628 టీఎంసీల నీటిని భీంఘనపురం రిజర్వాయర్‌లోకి తరలించారు. ఫేజ్-2 లోని ఒక మోటర్‌తో రోజుకు 247 క్యూసెక్కుల నీటిని పంపింగ్ చేస్తుండగా సాంకేతిక సమస్య ఏర్పడడంతో బంద్ చేసినట్లు డీఈ శరత్, ఏఈ సాయిరాం తెలిపారు.

మహిళ అదృశ్యం


సమ్మక్క (ఫైల్)

టేకుమట్ల, నవంబర్ 28 : మండలంలోని సుబ్బక్కపల్లికి చెందిన బొడ్డు సమ్మక్క(48) అదృశ్యమైనట్లు ఏఎస్సై దాట్ల కుమారస్వామి తెలిపారు. బుధవారం భర్త, కోడలు పనులకు వెళ్లగా, ఆమె ఎవరికీ చెప్పకుండా ఇంట్లో నుంచి వెళ్లిపోయింది. బంధువుల ఇళ్లలో వెతికినా జాడ లేపోవడంతో గురువారం స్థానిక పోలీసు స్టేషన్‌లో భర్త మల్లయ్య ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై తెలిపారు.

రాష్ట్రస్థాయి క్రీడలకు ఎంపిక

మహాముత్తారం, నవంబర్ 28: మండలంలోని స్తంభంపల్లి(పీపీ)పాఠశాల విద్యార్థి పసుల ఆర్యన్ జిల్లాస్థాయి సబ్ జూనియర్ అథ్లెటిక్స్ బ్రాడ్జంప్‌లో ప్రతిభ చూపి, డిసెంబర్ 1న మంచిర్యాలలో జరిగే రాష్ట్రస్థాయి క్రీడలకు ఎంపికైనట్లు జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ పూతల సమ్మ య్య తెలిపారు. కోచ్ పసుల శ్రీకాంత్, రవికుమార్ తోపాటు ఆర్యన్‌ను హెచ్‌ఎం భూక్యా రవినాయక్, టీచర్ కొంబం పద్మ, తల్లిదండ్రులు పసుల రాధిక -రవికుమార్‌అభినందించారు.

నలుగురికి ఉద్యోగాలు

ములుగు రూరల్, నవంబర్ 28 : సంక్షేమ భవనంలో గురువారం ఓ కంపెనీ జాబ్‌మేళాలో నలుగురికి ఉద్యోగ అవకాశాలు కల్పించినట్లు ఇన్‌చార్జి ఎంప్లాయ్‌మెంట్ ఆఫీసర్ తుల రవి తెలిపారు. సిబ్బంది మల్లయ్య, రవీందర్, రఘుపతి, నాగేశ్వర్‌రావు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

CHANGE OF NAME

★I, MUDIDE RAJITHA W/o. TEJESHWAR (New Name), previously called BARUPATI RAJITA (Old Name), and R/o. H.No. 6-6-9/D, Saraswathi Nagar, Road No. 3, Sai Nagar Colony, Gopalpur, Hanamkonda Mdl, Hanumakonda Dist, 506009, TG, India, and solemnly declare.
NTW-000

I, SHASHINDHAR E, R/o. 5-109, Gollawada, Thirumalagiri, Regonda Mdl., Jayashankar Bhupalpally-506 348, TS. Changed My Name as ENDLA SHASHIDHAR, S/o. Endla Cheralu.
NT-326825

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classified Ads
Please Contact...
9182777552
HANAMKONDA
9182777563
9182777961
WARANAGAL
9182777556
JAYASHANKAR BHUPALPALLY
9182777559
MULUGU
9182777135
MAHABUBABAD
9182777557
JANGAON
9182777565

మహిళా అభ్యుదయవాది పూలే

- మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి
- జ్యోతిబా పూలేకు ఘన నివాళి

కృష్ణకాలనీ : పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి

ములుగు రూరల్ : పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న రవీందర్

కృష్ణకాలనీ/ మహదేవపూర్/ ములుగురూరల్, నవంబర్ 28 : మహిళా అభ్యుదయవాది, ఆదర్శప్రాయుడు మహాత్మ జ్యోతిబాపూలే అని భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి అన్నారు. గురువారం భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో పార్టీ అర్బన్ అధ్యక్షుడు కటకం జనార్దన్ ఆధ్వర్యంలో మహాత్మ జ్యోతిబాపూలే వర్ధంతిని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా గండ్ర వెంకటరమణారెడ్డి హాజరై బీఆర్ఎస్ నాయకులతో కలిసి పూలే చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పూలే అంటరానితనం, కులవ్యవస్థ నిర్మూలనతో పాటు మహిళోద్ధరణకు కృషి చేశారన్నారు. ఆయనను ఆదర్శంగా తీసుకొని ప్రతి ఒక్కరూ నడుచుకోవాలన్నారు. కార్యక్రమంలో భూపాలపల్లి మున్సిపల్ చైర్‌పర్సన్ సెగ్గం వెంకటరాణి సిద్ధు, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ నూనె రాజు పటేల్, మాజీ వైస్ చైర్మన్ కొత్త హరిబాబు, బీఆర్ఎస్ అర్బన్ యూత్ అధ్యక్షుడు బుర్ర రాజు, కౌన్సిలర్లు ముంజంపల్లి మురళీధర్, దార పూలమ్మ, కోఆప్షన్ మెంబర్ దొంగల ఐలయ్య యాదవ్, టీజేఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు మాడ హరీశ్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు బీబీ చారి, గురజాల శ్రీనివాస్, జోరు ఈశ్వర్, శ్రీకాంత్ పటేల్, భాస్కర్, కృష్ణమూర్తి పాల్గొన్నారు. అలాగే, కేవీపీఎస్ ఆధ్వర్యంలో పూలే చిత్రపటానికి జిల్లా ఉపాధ్యక్షుడు ఆత్కూర్ శ్రీధర్ పూలమాల వేసి నివాళులర్పించారు. నాయకులు శ్రావణ్, శారద, కోమల, మల్లేశ్వరీ పాల్గొన్నారు. మహదేవపూర్ మండల కేంద్రంలోని కూరగాయల మార్కెట్ ఆవరణలో ఉన్న పూలే విగ్రహానికి బీసీ సంఘం భూపాలపల్లి జిల్లా ఇంచార్జి విజయగిరి సమ్మయ్య ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాయకులు పంతకాని శ్రీనివాస్, ఆన్కారి ప్రకాశ్, కారెంగుల బాపురావు, గడ్డం స్వామి, అడ్డురి కిష్టయ్య, కన్నెబోయిన ఐలయ్య, పెండ్యాల నరసింహస్వామి, చెన్నూరి చంద్రయ్య, తిప్పారి రవి, శ్రీపతి పోచయ్య, దడిగెల రాజయ్య, జోడు చంటి, సుంకరి సమ్మయ్య, జోడు రామకృష్ణ, పోలోజు వెంకటేశ్వర్లు, బీజేపీ మండల అధ్యక్షుడు ఆకుల శ్రీధర్, ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం మండల అధ్యక్షుడు మేరుగు లక్ష్మణ్ పాల్గొన్నారు. ములుగులో అంబేద్కర్ విగ్రహం వద్ద మహజన సోషలిస్టు పార్టీ(ఎంఎస్‌పీ) జిల్లా ఉపాధ్యక్షుడు మరాటీ రవీందర్ ఆధ్వర్యంలో పూలే వర్ధంతి నిర్వహించారు. ఎమ్మార్పీఎస్ నాయకుడు నెమలి నర్సయ్య, జన్ను రవి, బీఆర్ఎస్ నాయకుడు పోరిక గోవిందనాయక్, ప్రజా సంఘాల జిల్లా చైర్మన్ ముంజాల భిక్షపతిగౌడ్, దళిత నాయకుడు నద్దునూరి రమేశ్, చాకలి కుల పోరాట సమితి నాయకుడు నేరెళ్ల శంకర్, వీహెచ్‌పీఎస్ జిల్లా అధికార ప్రతినిధి కడారి సాంబయ్య పాల్గొన్నారు.

పరాక్ సర్వేను విజయవంతం చేయాలి

చిట్యాల, నవంబర్ 28 : పరాక్ రాష్ట్రీయ సర్వేక్షన్-2024 సర్వేను విజయవంతం చేయాలని న్యాస్ జిల్లా లెవెల్ కోఆర్డినేటర్ ఎస్ రమేశ్, జిల్లా అకడమీక్ కోఆర్డినేటర్ కే లక్షణ్ కోరారు. చిట్యాల, మొగుళ్లపల్లి, రేగొండ, గోరికొత్తపల్లి, టేకుమట్ల మండలాలకు చెందిన సూపర్‌వైజర్లు, ఫీల్డ్ ఇన్వెస్టిగేటర్లకు స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ మండలాల్లో ఎంపికైన పాఠశాలల్లో సర్వే విజయవంతం చేయడంలో ఫీల్డ్ ఇన్వెస్టిగేటర్ల పాత్ర కీలకమన్నారు. సర్వే సందర్భంగా విద్యార్థులు వందశాతం హాజరయ్యేలా హెచ్‌ఎంలు చర్యలు తీసుకోవాలన్నారు. ఎంఈవో కోడెపాక రఘుపతి మాట్లాడుతూ దేశవ్యాప్తంగా 3, 6, 9 తరగతుల విద్యార్థుల విద్యా సామర్థ్యాలను తెలుసుకునేందుకు న్యాస్ పరాక్ పరీక్ష నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆర్పీ రతన్‌సింగ్, ఇన్‌చార్జి హెచ్‌ఎం శ్రీరాం రఘుపతి పాల్గొన్నారు.

ఉప్పల్ రైల్వే స్లయిడ్‌ను పరిశీలిస్తున్న జీఎం రాజేశ్వర్‌రెడ్డి

ఉప్పల్ రైల్వే స్లయిడ్ పరిశీలన

భూపాలపల్లి రూరల్, నవంబర్ 28 : ఉప్పల్ రైల్వే స్లయిడ్‌ను భూపాలపల్లి సింగరేణి ఏరియా జనరల్ మేనేజర్ ఏనుగు రాజేశ్వర్ రెడ్డి గురువారం పరిశీలించారు. అనంతరం కోల్ యార్డ్‌కు లీజ్ ఇచ్చిన 9 ఎకరాలను పరిశీలించారు. అధికారులతో బొగ్గు రవాణా, డిస్పాచ్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. క్వాలిటీ మేనేజర్ టీ కుమారస్వామి, సెక్యూరిటీ ఆఫీసర్ మురళీమోహన్, ఇంజినీర్ శ్రీధర్ పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం

ఏటూరునాగారం, నవంబర్ 28 : మండల కేంద్రంలోని సాయిబాబా ఆలయ ఫంక్షన్ హాల్‌లో గురువారం హనుమకొండకు చెందిన శంకర్ కంటి దవాఖాన ఆధ్వర్యంలో కంటి పరీక్షలు చేశారు. శస్త్రచికిత్సకు 20 మందిని ఎంపిక చేసి తీసుకెళ్లారు. ఆలయ కమిటీ చైర్మన్ ప్రభాకర్, డాక్టర్ రిషాద్, సిబ్బంది బాలరాజు, రాహుల్, జ్ఞానదీప్ పాల్గొన్నారు.

విషగుళికలు రుచి చూసి..

అస్వస్థతకు గురైన కవలలు.. 108 వాహనం లేక ఇబ్బందులు

108 వాహనం కోసం చిన్నారులతో కాస్తున్న తల్లిదండ్రులు

వెంకటాపురం(నూగూరు), నవంబర్ 28 : ఇంట్లో విష గుళికలను ఇద్దరు కవల పిల్లలు రుచి చూసి అస్వస్థతకు గురైన ఘటన మండల కేంద్రంలో గురువారం జరిగింది. గ్రామస్తుల కథనం ప్రకారం.. స్థానిక పెరకబజారుకు చెందిన లక్ష్మణ్‌కు జ్ఞానేశ్వరీ, జ్ఞానవి అనే రెండేళ్ల కవలలు ఉన్నారు. లక్ష్మణ్ వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. పొలానికి అవసరమైన గుళికలను ఇంట్లో ఉంచగా పిల్లలు ఆడుకుంటూ వెళ్లి వాటిని రుచి చూశారు. అపస్మారక స్థితిలోకి వెళ్లారు. గమనించిన తల్లిదండ్రులు వెంకటాపురం వైద్యశాలకు తరలించారు. చిన్నారులకు ప్రథమ చికిత్స అందించిన వైద్యురాలు డెలివరీ కేసు ఉండగా, వారిని ఏటూరునాగారం ప్రభుత్వ దవాఖానకు రెఫర్ చేశారు. కాగా, ఏటూరునాగారం వెళ్లేందుకు 108 వాహనం అందుబాటులో లేకపోవడంతో చిన్నారులు వెంకటాపురం ప్రభుత్వ దవాఖానలో గంట పాటు వేచి ఉండాల్సి వచ్చింది. తీరా వాహనం రిపేరింగ్‌లో ఉందని తెలపడంతో చిన్నారులను ప్రైవేటు వాహనంలో ఏటూరునాగారం తరలించారు.

కేసుల పరిష్కారానికి కృషి చేయాలి

మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి సూర్యచంద్రకళ

ములుగురూరల్, నవంబర్ 28 : వచ్చే నెల 14న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌లో అత్యధిక కేసులు పరిష్కారమయ్యేలా అధికారులు కృషి చేయాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, న్యాయ సేవాధికార సంస్థ చైర్‌పర్సన్ ఎస్‌వీపీ సూర్యచంద్రకళ అన్నారు. గురువారం పోలీస్, రెవెన్యూ, ఫారెస్ట్, ఎక్సైజ్ అధికారులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. రాజీ పడే కక్షిదారులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా కేసులను పరిష్కరించాలన్నారు. ఎలాంటి న్యాయ సలహా, సూచన కోసం న్యాయ సేవాధికార సంస్థను ఆశ్రయించాలని సూచించారు. సమావేశంలో సినియర్ సివిల్ జడ్జి, న్యాయ సేవాధికార సంస్థ జిల్లా కార్యదర్శి టీ కన్నయ్యలాల్, డీఎఫ్‌వో రాహుల్ కిషన్ జాదవ్, ఆర్డీవో వెంకటేశ్, డీఎస్పీ రవీందర్, ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

దీక్షా దివస్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

టీబీజీకేఎస్ భూపాలపల్లి బ్రాంచ్ ఉపాధ్యక్షుడు బడితల సమ్మయ్య


మాట్లాడుతున్న భూపాలపల్లి బ్రాంచ్ ఉపాధ్యక్షుడు సమ్మయ్య

భూపాలపల్లి రూరల్, నవంబర్ 28 : జిల్లా కేంద్రంలో శుక్రవారం నిర్వహించనున్న దీక్ష దివస్ కార్యక్రమంలో తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం నాయకులు, సింగరేణి కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని భూపాలపల్లి ఏరియా బ్రాంచ్ ఉపాధ్యక్షుడు బడితల సమ్మయ్య పిలుపునిచ్చారు. గురువారం భూపాలపల్లి టీబీజీకేఎస్ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు జిల్లా కేంద్రంలో పార్టీ జిల్లా అధ్యక్షురాలు గండ్ర ఆధ్వర్యంలో దీక్ష దివస్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమాన్ని అందరూ అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. సమావేశంలో కేంద్ర కమిటీ ఆర్గనైజ్ సెక్రటరీ దేవరకొండ మధు, బ్రాంచ్ సెక్రటరీ బాషనపల్లి కుమార్, ఫిట్ సెక్రటరీలు కాగితపు సురేశ్, నరేశ్ నేత, సంపత్ కుమార్, నాయకులు, ముస్కే లక్ష్మణ్, సుంకరి గోవర్ధన్, లింగాల ప్రవీణ్ కుమార్, కేశ్రీకాంత్, పాల్గొన్నారు.

ములుగు జిల్లాలో..

ములుగురూరల్ : బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించే దీక్ష దివస్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పార్టీ ములుగు జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మణ్‌రావు గురువారం ఒక ప్రకటనలో కోరారు. శుక్రవారం ఉదయం 10 గంటలకు బండారుపల్లి రోడ్డులోని బీఆర్ఎస్ భవన్‌లో నిర్వహించే కార్యక్రమానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు, మాజీ ప్రజాప్రతినిధులు అధిక సంఖ్యలో హాజరు కావాలని ఆయన కోరారు.

విజయోత్సవాలను విజయవంతం చేయాలి


అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ దివాకర

ములుగు రూరల్, నవంబర్28 : ప్రజా పాలన ప్రజా విజయోత్సవాల కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ములుగు డీఎల్ఆర్ గార్డెన్‌లో నిర్వహించే ప్రత్యేక కార్యక్రమంలో ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కలెక్టర్ టీఎస్ దివాకర కోరారు. గురువారం ఆయన ఏర్పాట్లను పరిశీలించి అధికారులతో మాట్లాడారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచి డీఎల్ఆర్ గార్డెన్ వరకు ర్యాలీ నిర్వహించి కళా బృందాలతో సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. అంతడుపుల నాగరాజు సారథ్యంలో జరిగే కార్యక్రమంలో మంత్రి సీతక్క ముఖ్య అతిథిగా హాజరవుతారని తెలిపారు. ఆయన వెంట అదనపు కలెక్టర్ మహేందర్‌జీ, ఆర్డీవో వెంకటేశ్, డీఎల్‌పీఓ దేవరాజు, డీపీఆర్వో రఫిక్ ఉన్నారు. కాగా, జాతీయ ఆరోగ్య మిషన్, రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ అధికారులు ప్రజారోగ్యం, కుటుంబ సంక్షేమంపై రూపొందించిన కరపత్రాలను కలెక్టర్ టీఎస్ దివాకర ఆవిష్కరించారు. డెమో సంపత్ పాల్గొన్నారు.

కేటీకే ఓసీ-3 ఫిట్ సెక్రటరీగా తోటపల్లి వైకుంఠం

భూపాలపల్లి రూరల్, నవంబర్ 28 : తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం (టీబీజీకేఎస్) భూపాలపల్లి ఏరియా బ్రాంచ్ ఉపాధ్యక్షుడు బడితల సమ్మయ్య అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో కేటీకే ఓసీ-3 ఫిట్ సెక్రటరీగా తోటపల్లి వైకుంఠం(ఈపీ ఆపరేటర్)ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మల దహనం


కృష్ణకాలనీ : అంబేద్కర్ సెంటర్‌లో సీఎం దిష్టిబొమ్మను దహనం చేస్తున్న ఏబీవీపీ నాయకులు

కృష్ణ కాలనీ/ చిట్యాల/ మహదేవపూర్, సెప్టెంబర్ 28 : రాష్ట్రంలోని ప్రభుత్వ గురుకులాలు ఫుడ్ పాయిజన్ కావడం, ఓ విద్యార్థి మృతి చెందడాన్ని నిరసిస్తూ గురువారం పలు చోట్ల ఏబీవీపీ ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మలను దహనం చేశారు. భూపాలపల్లిలోని అంబేద్కర్ సెంటర్‌తోపాటు చిట్యాల, మహదేవపూర్‌లో ఆందోళన చేపట్టారు. భూపాలపల్లిలో ప్రాంతీయ కమిటీ సభ్యుడు వేల్పుల రాజ్ కుమార్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ప్రేమ్ కుమార్, వికాస్,సాయి ,రామ్ చరణ్,లక్ష్మణ్, బంటి, విఘ్నేష్, సంతోష్, విష్ణు, చిట్యాలలో టౌన్ అధ్యక్షుడు బుర్ర అభిజ్ఞ గౌడ్, బుర్ర అవినాష్, అజయ్, రోహిత్, హరికుమార్, అజయ్, శివ, నాగ రాజు, మహదేవపూర్‌లో గర కార్యదర్శి పేట సాయి, రఘు, సాయి ,వరుణ్, విష్ణు, రంజిత్ పాల్గొన్నారు.


డబుల్ బెడ్రూం ఇండ్ల వద్ద రెండో రోజూ ఆందోళన చేస్తున్న లబ్ధిదారులు

రెండో రోజూ 'డబుల్ బెడ్రూం' లబ్ధిదారుల ఆందోళన

కృష్ణకాలనీ, నవంబర్ 28 : భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని 11వ వార్డు భాస్కర్‌గడ్డలో డబుల్ బెడ్రూం ఇండ్ల లబ్ధిదారుల ఆందోళన రెండో రోజైన గురువారం కొనసాగింది. బీఆర్ఎస్ ప్రభుత్వం తమకు ఇండ్లు కేటాయించినా కాంగ్రెస్ సర్కారు ఏడాదైనా పట్టాలివ్వడం లేదని కాంగ్రెస్ ప్రభుత్వంపై నిరసన చేపట్టారు. లబ్ధిదారులు నూతి రమేశ్, బండి కుమార్, తాటికొండ సమ్మక్క మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వం 2020లో 392 మంది పేదలకు ఇండ్లు కేటాయించిందని, అసెంబ్లీ ఎన్నికలు రావడంతో పట్టాలు ఇవ్వలేదన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగా, స్థానిక ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావును కలిసి సమస్యను వివరించగా రీసర్వే చేయించి కేటాయించలేదన్నారు. దీంతో ఒకేసారి తాళాలు పగులకొట్టి ఇండ్లలోకి వెళ్లామన్నారు. తమ సమస్యపై ఒక కమిటీని ఏర్పాటు చేసి కాలయాపన చేస్తున్నారని ఆరోపించారు. పోలీసులు వచ్చి 15 రోజుల్లో ఇండ్లకు పట్టాలిప్పిస్తామని చెప్పి నెలలు గడుస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే సైతం దసరా నాటికి ఇస్తామని చెప్పినా అది నెరవేరలేదన్నారు. లబ్ధిదారుల ఆందోళనకు ధర్మ సమాజ్ పార్టీ నాయకులు మద్దతు పలికారు. పద్మ, చంద్రశేఖర్, చక్రపాణి, రవీందర్, రాధతో పాటు మరో 35 మంది లబ్ధిదారులు పాల్గొన్నారు.

నేతకానీలు హక్కుల సాధనకు ఉద్యమించాలి


సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

తాడ్వాయి, నవంబర్ 28 : నేతకానీ కులస్తులు హక్కుల సాధన కోసం ఉద్యమించాలని నేతకానీ రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు కావేరి చిన్నికృష్ణ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోగు మల్లయ్య పిలుపునిచ్చారు. మండలంలో బీరెల్లిరంగాపూర్, నర్సాపురం గ్రామాల్లో బాడిశ వెంకన్న, గాంధర్ల కాంతారావు అధ్యక్షతన గురువారం కుల సంఘం గ్రామసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆదిలాబాద్, ఉమ్మడి కరీంనగర్, ఉమ్మడి వరంగల్ జిల్లాల్లో నేతకానీలు అధికంగా నివసిస్తూ విద్యా, ఉపాధి, వైద్య రంగాల్లో చాలా వెనుకబడి ఉన్నారన్నారు. ఎస్సీల్లో వర్గీకరణ చేస్తే నేతకానీలను ఏ కేటగిరీలో చేర్చించి, ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని, పోడు భూములకు హక్కుపత్రాలు ఇవ్వాలని కోరారు. ఐటీడీఏలో పరిధిలో నివసిస్తున్న నేతకానీలకు ఐదు శాతం రిజర్వేషన్ కల్పించాలన్నారు. గ్రామ సభల్లో జిల్లా అధ్యక్షుడు దీకొండ కాంతారావు, ప్రధాన కార్యదర్శి కొండగొర్ల పోశయ్య, రాష్ట్ర సోషల్ మీడియా ఇన్‌చార్జి సునార్కాని శ్యామ్, వెంకటయ్య, బానిస రాంబాబు, జనగాం నరసింహారావు, సల్లూరు సత్యం, నర్సింగరావు, మల్లయ్య, బానిస వీరయ్య, నారాయణ, వీరయ్య, సీతారాములు, రంగారావు పాల్గొన్నారు.

శాస్త్రీయ విజ్ఞానంతోనే సమాజ అభివృద్ధి


భూపాలపల్లి రూరల్ : సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ కిరణ్ ఖరే

భూపాలపల్లి రూరల్, నవంబర్ 28 : శాస్త్రీయ విజ్ఞానంతోనే సమాజ అభివృద్ధి జరుగుతుందని ఎస్పీ కిరణ్ ఖరే అన్నారు. గురువారం జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు పొగాకుల రాధాకృష్ణ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్‌ను భూపాలపల్లి మాంటిస్సోరి హైస్కూల్‌లో నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎస్పీ హాజరై మాట్లాడుతూ జీవితంలో ప్రతి విద్యార్థి లక్ష్యాన్ని కలిగి ఉండాలన్నారు. జన విజ్ఞాన వేదిక ప్రధాన కార్యదర్శి వేల్పుల రాజు మాట్లాడుతూ విద్యార్థులు, ప్రజల్లో శాస్త్రీయ దృక్పథాలను తీసుకురావడమే చెకుముకి సైన్స్ సంబురాల లక్ష్యమన్నారు. విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించి రాష్ట్రస్థాయికి అర్హత సాధించిన విజేతలను ప్రకటించారు. చెకుముకి జిల్లా కన్వీనర్ బొట్ల సాంబయ్య, జన విజ్ఞాన వేదిక ఆర్థిక కార్యదర్శి బొట్ల కుమార్, మాంటిసోరి పాఠశాల యజమాన్యం శ్రీనివాసరావు, హెచ్‌ఎం లక్ష్మీ ప్రసన్న, చెకుముకి మండల కన్వీనర్లు సూధం సాంబమూర్తి, పోలు నాగరాజు, దేవ్ సింగ్, కుర్రి శ్రీనివాస్, సూర్య కిరణ్ పాల్గొన్నారు. కాగా, జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ నేర సమీక్ష నిర్వహించారు. పోక్సో, ఎస్సీ, ఎస్టీ, తీవ్రమైన నేరాల కేసుల విచారణను త్వరగా పూర్తి చేసి, చార్జిషీట్ దాఖలు చేయాలన్నారు. ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో ఎక్కువగా రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రదేశాలను గుర్తించి (బ్లాక్ స్పాట్స్) నివారణకు చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ బోనాల కిషన్, భూపాలపల్లి, కాటారం డీఎస్పీలు సంపత్ రావు, రామ్మోహన్ రెడ్డి, సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

ములుగు జిల్లాలో..

ములుగురూరల్/ఏటూరునాగారం : జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో చెకుముఖి పోటీలను జిల్లాలోని పలు ప్రభుత్వ పాఠశాల్లో నిర్వహించినట్లు డీఈఓ జీ పాణిని తెలిపారు. పోటీల్లో పలువురు విద్యార్థులు ప్రతిభ చాటి రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు తెలిపారు. ఆదిలాబాద్‌లో జరిగే పోటీలకు ప్రభుత్వ పాఠశాలల నుంచి పస్రా నాగారం జడ్పీహెచ్ఎస్, ప్రైవేట్ విభాగం నుంచి పస్రాలోని సెయింట్ మేరీ స్కూల్, రెసిడెన్షియల్ విభాగం నుంచి వెంకటాపూర్ పాఠశాల విద్యార్థులు పాల్గొంటారని పేర్కొన్నారు. కాగా, ఎంపికైన విద్యార్థులకు డాక్టర్ వరప్రసాద్‌రావు చేతులమీదుగా బహుమతులను అందజేశారు. జనవిజ్ఞాన వేదిక ప్రతినిధులు గడ్డి శ్రీనివాస్, కలకొట్ల నరేశ్ రెడ్డి, పల్లె నాగరాజు, పొడెం సమ్మయ్య, పత్రి కిరణ్, నాగేందర్, రేల విజయ్, యమున, రజిత, హెచ్‌ఎం సాంబశివరావు, శ్రీనువాస్, ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ జిల్లా బాధ్యులు ప్రవీణ్, రవి పాల్గొన్నారు.

శంకరాంపల్లిలో చోరీ

18 తులాల బంగారు ఆభరణాలు అపరణ

కాటారం, నవంబర్ 28 : మండలంలోని శంకరంపల్లి గ్రామపంచాయతీ పరిధి బుడగజంగాల కాలనీ సమీపంలో ఓ ఇంట్లో చోరీ జరిగింది. కాటారం సీఐ నాగార్జున రావు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. అనమాల సత్తమ్మ భర్త కొన్నేళ్ల క్రితం మృతిచెందాడు. కుమారుడు కార్తీక్, కూతురు మానికకు వివాహాలు చేసింది. కుమారుడు కార్తీక్ దంపతులు హైదరాబాద్‌లో ఉంటున్నారు. కూతురు గర్భిణి కాగా సత్తమ్మ వారం క్రితం ఇంటికి తాళం వేసి ఆమె వద్దకు వెళ్లింది. గురువారం సత్తమ్మ ఇంటి తలుపులు తీసి ఉండగా పక్కింటి వారు కార్తీక్‌కు ఫోన్ చేశారు. అతడు పోలీసులకు సమాచారం ఇచ్చి హుటాహుటిన ఇంటికి వచ్చాడు. ఇంట్లో బీరువాల తాళాలు పగులగొట్టి సామగ్రి చిందరవందరగా పడి ఉన్నాయి. సుమారు 18 తులాలకు పైగా బంగారు ఆభరణాలు, 50 గ్రాములకు పైగా వెండి ఆభరణాలు, 32 ఇంచుల ఎల్ఈడీ టీవీని ఎత్తుకెళ్లినట్లు బాధితులు తెలిపారు. సీఐతోపాటు క్లూస్‌టీం ఇన్‌చార్జి సీఐ రాజ్‌కుమార్ పరిశీలించారు. అక్కడున్న గడ్డపార, తాళం, ఇతర వస్తువులపై ఫింగర్‌ప్రింట్స్, ఇతర క్లూస్ సేకరించారు. కార్తీక్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.


నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న కేజీబీవీ ఉపాధ్యాయులు

కేజీబీవీ ఉపాధ్యాయుల నిరసన

కాటారం, నవంబర్ 28 : ప్రభుత్వం సమగ్ర శిక్ష ఉద్యోగులందరికీ కనీస వేతన స్కేల్ అమలు చేసి, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని కాటారం కేజీబీవీ ఉపాధ్యాయులు, సిబ్బంది గురువారం నల్ల బ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించకుంటే సమష్టిగా ఆందోళనలు చేస్తామన్నారు. ఎస్‌వో చల్ల సునీత, అరుణ, సరిత, శిరీష, సుజాత, మణిమాల, రాజమణి, స్వప్న, రాజేశ్వరి, నళిని, శ్రీలత, లక్ష్మి, విజయ, మౌనిక, అనూష, దుర్గమ్మ, సమ్మక్క పాల్గొన్నారు.

రైతుల భూములను పరిశీలించిన ఆర్డీవో

మొగుళ్లపల్లి, నవంబర్ 28 : గ్రీన్ ఫీల్డ్ నేషనల్ హైవేలో తమ విలువైన, సారవంతమైన భూములు కోల్పోతున్నామని మండలంలోని రంగాపురం గ్రామానికి చెందిన రైతులు ఫిర్యాద చేయగా ఆర్డీవో మంగీలాల్ గురువారం గ్రామంలో రైతుల భూములను పరిశీలించారు. తుది నివేదికను కలెక్టర్‌కు అందజేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ సునీత, ఆర్ఐ సురేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లు వెంటనే చేపట్టాలి

భూపాలపల్లి కలెక్టర్ రాహుల్ శర్మ


విద్యార్థులతో నేలపై కూర్చుని భోజనం చేస్తున్న కలెక్టర్

మల్హర్, నవంబర్ 28 : నాణ్యమైన ధాన్యాన్ని కేంద్రాల్లో వెంటనే కొనుగోలు చేయాలని భూపాలపల్లి కలెక్టర్ రాహుల్‌శర్మ ఆదేశించారు. మండలంలోని తాడిచెర్ల, పెద్దతూండ్లలో ధాన్యం కేంద్రాలను గురువారం ఆయన తనిఖీ చేశారు. కొనుగోలు కేంద్రాల వద్ద నిల్వ ఉంచకుండా ట్యాగ్ చేసిన మిల్లులకు వెంటనే ధాన్యం రవాణా చేయాలన్నారు. తేమ శాతాన్ని పరిశీలించి సిబ్బందికి సూచనలు ఇచ్చారు. ఎంపీడీవో, తహసీల్దార్ కార్యాలయంలో జరుగుతున్న సమగ్ర కుటుంబ సర్వే డేటా ఎంట్రీని కలెక్టర్ పరిశీలించారు. గ్రంథాలయ భవనం, సహకార సంఘం భవనాలను పరిశీలించి పనులను పూర్తి చేయాలన్నారు.

విద్యార్థులతో కలిసి భోజనం

కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని కలెక్టర్ తనిఖీ చేశారు. పాఠశాలలో బియ్యం, సరుకుల నాణ్యతను పరిశీలించారు. విద్యార్థుల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి నేలపై కూర్చుని కలెక్టర్ భోజనం చేశారు. సోలార్ విద్యుత్ మరమ్మతుకు సత్వర చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లా సహకార అధికారి వాల్యానాయక్, తహసీల్దార్ రవికుమార్, ఎంపీడీవో శ్యాంసుందర్, పీఏసీఎస్ చైర్మన్ మొండయ్య, సీఈవో సంతోష్, ఎస్‌వో మహేశ్వరి, సిబ్బంది పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ


సంపత్ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న గండ్ర గౌతంరెడ్డి

కృష్ణ కాలనీ, నవంబర్ 28 : భూపాలపల్లి మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు బేతోజు వజ్రమణి బీబీచారి ఇటీవల అనారోగ్యానికి గురై దవాఖానలో చికిత్స పొంది ఇంటికి చేరుకోగా భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి గురువారం ఆమెను పరామర్శించారు. ఆయన వెంట భూపాలపల్లి మున్సిపల్ చైర్‌పర్సన్ సెగ్గం వెంకటరాణి సిద్ధు, బీఆర్ఎస్ భూపాలపల్లి పట్టణ, రూరల్ అధ్యక్షులు కటకం జనార్దన్, పిన్ రెడ్డి రాజిరెడ్డి, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ నూనె రాజ్‌పటేల్, బీఆర్ఎస్ అర్బన్ యూత్ అధ్యక్షుడు బుర్ర రాజు, మాడ హరీశ్‌రెడ్డి, శ్రీనివాస్, విద్యాసాగర్ రెడ్డి, కృష్ణమూర్తి, కౌన్సిలర్ ముంజంపల్లి మురళీధర్, శ్రీకాంత్ పటేల్ ఉన్నారు. అలాగే, 10వ వార్డు పుల్లూరి రామయ్య పల్లికి చెందిన బీఆర్ఎస్ యూత్ నాయకుడు పర్శ రజినీకాంత్ తండ్రి సంపత్ అనారోగ్యంతో మృతిచెందగా బాధిత కుటుంబాన్ని జీఎంఆర్ఎం ట్రస్ట్ సీఈవో గండ్ర గౌతంరెడ్డి పరామర్శించారు. సంపత్ మృతదేహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. గౌతంరెడ్డి వెంట కౌన్సిలర్ బద్ది సమ్మయ్య, బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

విద్యార్థినికి ఆర్థికసాయం

భూపాలపల్లి రూరల్, నవంబర్ 28 : భూపాలపల్లిలోని మాంటిస్సోరి హై స్కూల్ విద్యార్థిని పీ మోహన సాయిప్రియ కాలేయ సంబంధిత వ్యాధితో బాధపడుతూ హైదరాబాద్‌లోని దవాఖానలో చికిత్స పొందుతున్నది. నిరుపేద కుటుంబానికి చెందిన ఆమెకు మెరుగైన చికిత్స అందించడం కోసం మాంటిస్సోరి హైస్కూల్ యాజమాన్యం, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు సహృదయంతో స్పందించి రూ.2,38,260 సమకూర్చారు. ఈ మేరకు విద్యార్థిని తండ్రి యుగేంద్రచారికి జిల్లా ఎస్పీ కిరణ్ ఖరే చేతుల మీదుగా ఆ చెక్కు అందజేశారు. కార్యక్రమంలో స్కూల్ చైర్మన్ జోస్ నెడుంతుండం, ప్రెసిడెంట్ గండ్ర సుధాకర్, డైరెక్టర్ నూకల శ్రీనివాస్, హెచ్‌ఎం బిన్నుజీ, ఉపాధ్యాయులు అనిల్ కుమార్, సునీల, సిబ్బంది పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు 'స్వయంకృషి' చేయూత

కాటారం, నవంబర్ 28 : నిరుపేద విద్యార్థులకు స్వయంకృషి స్వచ్ఛంద సేవా సంస్థ చేయూత అందించింది. మండలంలోని ధన్వాడ గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు శంకరాంపల్లికి చెందిన డాక్టర్ అంగజాల కిశోర్ సహకారంతో గురువారం స్టడీ మెటీరియల్స్, పరీక్ష ప్యాడ్లను అందజేశారు. హెచ్‌ఎం శ్రీదేవి, స్వయం కృషి ఫౌండర్ కొట్టె సతీశ్, శంకరంపల్లి మాజీ సర్పంచ్ అంగజాల అశోక్, గ్రామస్తులు శివ, బోడ శ్రీధర్, చిటూరి రాజేశ్, గోనె మహేశ్, రాజు నాయక్, రెడ్డిపల్లి రవి, ప్రభుదేవ, ఆకుల చంటి, స్వయంకృషి సభ్యులు హైమద్, శేఖర్, రవి, రాజశేఖర్ పాల్గొన్నారు.

విద్యాలయాల్లో తనిఖీలు నిర్వహించాలి

మంగపేట, నవంబర్ 28 : విద్యాలయాల్లో ప్రతి రోజు విద్యార్థులకు అందించే భోజన పదార్థాల తనిఖీలు ముమ్మరంగా నిర్వహించాలని జాతీయ మానవ హక్కుల కమిటీ ములుగు జిల్లా ఉపాధ్యక్షుడు గాదె శ్రీనివాసాచారి డిమాండ్ చేశారు. గురువారం ఆయన మాట్లాడుతూ అధికారులు తనిఖీలు సక్రమంగా చేయకపోవడం వల్లనే ఇటీవల గురుకులాల్లోని పలువురు విద్యార్థులు ఫుడ్ పాయిజన్ బారిన పడ్డారన్నారు. నాసిరకం పదార్థాలతో భోజనాలు చేస్తే వెంటనే సంబంధిత హాస్టల్ వెల్ఫేర్ అధికారులపై చర్యలు చేపట్టాలన్నారు. ఇటీవల గురుకులాల్లో జరిగిన ఫుడ్ పాయిజన్ ఘటనలపై పూర్తి స్థాయి విచారణ జరిపి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి


జనార్దన్ (ఫైల్)

మొగుళ్లపల్లి, నవంబర్ 28 : దీర్ఘకాల వ్యాధులతో బాధపడుతూ జీవితంపై విరక్తి చెంది పురుగుల మందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతిచెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని పిడిసిల్ల గ్రామానికి చెందిన గడ్డం జనార్దన్(65) కొంతకాలంగా టీబీ, ఆస్తమా వ్యాధులతో బాధపడుతున్నాడు. దీంతో జీవితంపై విరక్తి చెంది మనోవేదనతో ఈ నెల 25న పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు గమనించి చికిత్స నిమిత్తం వరంగల్‌లోని ఎంజీఎం దవాఖానకు తరలించగా చికిత్స పొందుతూ బుధవారం అర్ధరాత్రి మృతి చెందాడు. మృతుడి భార్య గడ్డం తారమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అశోక్ తెలిపారు.